సాక్షి
అనంతపురం
బుధవారం । 18 । సెప్టెంబర్ । 2024



ఇసుక దందా బట్టబయలు
టీడీపీ నాయకుల ఇసుక దందా బట్టబయలైంది. అధికారులు తనిఖీలు నిర్వహించి ఇసుక ట్రాక్టర్లు పట్టుకున్నారు.
8లో



టమాట కిలో రూ.35
అనంతపురం కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.35 పలికింది. కనిష్టం రూ.17, సరాసరి రూ.28 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.8°/22.3°
జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. సాయంత్రం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి.

న్యూస్‌రీల్

వైద్య కళాశాలకు 50 యూజీ సీట్ల మంజూరు


అనంతపురం మెడికల్ కళాశాల

అనంతపురం మెడికల్: అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాలలో యూజీ సీట్ల సంఖ్య పెరిగింది. కొత్తగా 50 సీట్లు మంజూరయ్యాయి. దీంతో మొత్తం సీట్ల సంఖ్య 200కు చేరింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ సీట్లు భర్తీ చేయనున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అనంతపురం బోధనాస్పత్రిని బలోపేతం చేశారు. విప్లవాత్మక సంస్కరణలు ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు పలు మార్లు ఢిల్లీకి వెళ్లి ఇక్కడి సదుపాయాలను ఎన్ఎంసీ (నేషనల్ మెడికల్ కమిషన్)కు వివరించారు. రోగులకందుతున్న మెరుగైన సేవలను తెలియజేశారు. ఈ క్రమంలో సీట్లు పెంచడంపై కళాశాల వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి.

రేపటి నుంచి మూడో రౌండ్ మ్యాచ్‌లు


సూర్యకుమార్ యాదవ్‌కు స్వాగతం పలుకుతున్న దృశ్యం

అనంతపురం: దులీప్ ట్రోఫీలో భాగంగా గురువారం నుంచి మూడో రౌండ్ పోటీలు ప్రారంభం కానున్నాయి. ఆర్డీటీ క్రీడా గ్రామంలో 22వ తేదీ వరకు సాగనున్నాయి. ఇండియా–బీ వర్సెస్ ఇండియా–డీ మ్యాచ్ గ్రౌండ్–బీలో, ఇండియా–ఏ వర్సెస్ ఇండియా–సీ మ్యాచ్ గ్రౌండ్–ఏలో జరగనుంది.

వచ్చేశాడు సూర్యాభాయ్
దులీప్ ట్రోఫీ మ్యాచుల్లో పాల్గొనేందుకు భారత జట్టు స్టార్ ఆటగాడు సూర్యకుమార్ యాదవ్ మంగళవారం అనంతపురం చేరుకున్నాడు. అతనికి ఘనస్వాగతం లభించింది. సూర్యను చూసేందుకు అభిమానులు బారులు తీరారు. వైఎస్సార్ సీపీ నేత హరీష్‌కుమార్ యాదవ్... సూర్యను మర్యాదపూర్వకంగా కలిశారు.

ప్రత్యక్ష వీక్షణ లేనట్లే..
దులీప్ ట్రోఫీలో భాగంగా ఇప్పటివరకూ జరిగిన మ్యాచుల్లో సూర్య పాల్గొనలేదు. చేతి వేలికి గాయం కారణంగా విశ్రాంతి తీసుకున్నాడు. వాస్తవానికి సూర్య ఇండియా–సీ జట్టుకు ప్రాతినిధ్యం వహించాల్సి ఉండగా, ఇండియా– బీ జట్టులో ఆడాలని సెలెక్టర్లు సూచించారు. దీంతో ఆయన బీ జట్టు తరఫున ఆడతాడు. ఆర్డీటీ క్రీడా గ్రామంలోని గ్రౌండ్–ఏలో జరిగే మ్యాచ్‌ను మాత్రమే ప్రేక్షకులు చూసే అవకాశం ఉండడంతో సూర్యకుమార్ యాదవ్ బ్యాటింగ్‌ను ప్రత్యక్షంగా చూసే అవకాశం ఉండదు.

జిల్లాకు వర్షసూచన

బుక్కరాయసముద్రం: జిల్లాలో రానున్న 5 రోజుల్లో చిరు జల్లులు కురిసే అవకాశం ఉన్నట్లు రేకులకుంటలో ఉన్న ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నారాయణస్వామి, తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

బద్రీనాథ్ యాత్రలో తాడిపత్రివాసుల క్షేమం


బద్రీనాథ్ యాత్రలో తాడిపత్రి యాత్రికులు

తాడిపత్రి అర్బన్: ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని బద్రీనాథ్ యాత్రకు వెళ్లిన తాడిపత్రికి చెందిన 36 మంది క్షేమంగా ఉన్నట్లు యాత్రికుల్లో ఒకరైన పట్టణానికి చెందిన భూమా హరినారాయణ తెలిపారు. వీరంతా ఇటీవల యాత్రకు వెళ్లారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో బద్రీనాథ్‌లోని గోచార, రుద్ర ప్రయాగ దగ్గర రోడ్డుకు అడ్డంగా కొండ చరియలు విరిగిపడి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ క్రమంలో యాత్రికులు 23 గంటల పాటు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయారు.కొండప్రాంతం కావడంతో తినడానికి తిండి, తాగడానికి నీరు లేక అష్టకష్టాలు పడ్డారు. మంగళవారం మధ్యాహ్నం అక్కడి ప్రభుత్వం స్పందించి సహాయక చర్యలు చేపట్టింది. రహదారి మార్గాన్ని క్లియర్ చేయడంతో తామంతా సురక్షితంగా బయటపడి హరిద్వార్‌కు చేరుకున్నామని హరినారాయణ 'సాక్షి'కి ఫోన్‌లో తెలిపారు. దీంతో కుటుంబీకులు ఊపిరి పీల్చుకున్నారు.



పేద విద్యార్థులతో చెలగాటం

రాష్ట్రంలో నూతన వైద్య కళాశాలలు ఏర్పాటైతే పేద విద్యార్థులకు వైద్య విద్య అభ్యసించేందుకు సులువుగా ఉండేది. గత ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకుంటే ఎంతో ఆనంద పడ్డాం. కానీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వం వైద్య సీట్లు వద్దని ఎన్ఎంసీకి లేఖ రాయడం సబబు కాదు. కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టేందుకు వైద్య విద్యను ప్రైవేటీకరణ చేసే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోంది. అనాలోచిత నిర్ణయాలతో పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడటం మానుకోవాలి.
– రాధాజ్యోతి, ఆర్ట్స్ కళాశాల విద్యార్థిని, అనంతపురం



ప్రభుత్వంపై ఉద్యమిస్తాం

వైద్య విద్యను ప్రైవేటీకరణ చేయాలని కూటమి సర్కారు చూస్తోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైద్య కళాశాలల్లో 50 శాతం సీట్లను ప్రైవేట్ పరం చేసిందని, తమ ప్రభుత్వం ఏర్పడితే ఆ జీఓలను రద్దు చేస్తామంటూ యువగళం పాదయాత్రలో నారా లోకేష్ చెప్పారు. ఇప్పుడు వైద్య కళాశాలలకు సీట్లు అవసరం లేదంటూ ఎన్ఎంసీకి లేఖ రాయడం దారుణం. వైద్య విద్యను ప్రైవేటుపరం చేస్తే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమాలకు శ్రీకారం చుడతాం.
– సాయిస్వరూప, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యురాలు



కందిపప్పు కొండెక్కి కూర్చుంది. నూనె సలసలా మండుతోంది. కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. పెరిగిన నిత్యావసరాల ధరలు ఉమ్మడి అనంతపురం జిల్లాలో సామాన్యులకు చుక్కలు చూపుతున్నాయి. ఏం కొనాలి..ఏం తినాలి అంటూ ఆందోళన చెందుతున్నారు. లక్షలాది కుటుంబాలు నిత్యావసరాలు కొనలేక అల్లాడిపోతున్నాయి. చౌకదుకాణాల ద్వారా సర్కారు నుంచి అందాల్సిన సాయం కూడా కరువవడంతో తమకెవరు దిక్కు అంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- కొండెక్కిన కందిపప్పు
- కేజీ 170 రూపాయలు దాటిన వైనం
- రూ. 50కి చేరువలో మినపప్పు
- ఇప్పటికే కన్నీళ్లు పెట్టిస్తున్న ఉల్లి
- నూనెలన్నీ 140 రూపాయల పైమాటే
- పచ్చిమిర్చి, టమాట మినహా కూరగాయల ధరలన్నీ ఆకాశంలోనే..
- నిత్యావసరాల ధరల ధాటికి సామాన్యుడి విలవిల



నిప్పల్లా నిత్యావసరాలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: గతంలో ఎన్నడూ లేని రీతిలో నిత్యావసరాల ధరలు మండిపోతున్నాయి. మధ్యతరగతి, పేదల ఇళ్లలో కందిపప్పు లేనిదే రోజు గడవదు. అలాంటి కందిపప్పు కేజీ రూ.150 దాటిపోయింది. పచ్చడి మెతుకులైనా తిందామా అంటే ఉల్లి గడ్డ నిప్పులా మారింది. నెల రోజులుగా కేజీ రూ. 80 నుంచి దిగనంటోంది. మధ్యతరగతి కుటుంబాలకు మినప్పప్పు లేనిదే నాలుగు ఇడ్లీలో దోసెలో తినడానికి వీలు పడదు. కానీ నేడు మినప్పప్పు కొందామంటే కూడా చుక్కలు కనిపిస్తున్నాయి. కేజీ రూ.150కి చేరడంతో సామాన్యుడికి ఏం చేయాలో దిక్కుతోచడం లేదు.

కాగుతున్న వంట నూనెలు..
రీఫైండ్ ఆయిల్ అటుంచితే పామాయిల్ లాంటివి కూడా కొండెక్కి కూర్చుంటే ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటి? సన్‌ఫ్లవర్, వేరుశనగ ఇలా ఏదైనా సరే లీటర్ ప్యాకెట్లు రూ.140 పలుకుతున్నాయి. చివరకు పామాయిల్ రూ.130 కంటే తక్కువ లేదు. వీటి ధరలు అమాంతం పెరగడంతో మార్కెట్లోకి కల్తీనూనెలు వచ్చాయి. పదే పదే వాడిన నూనెలు రీసైకిల్ చేసి సీసాల్లో రూ.60 లేదా రూ.70కి అమ్ముతుంటే పేదలు వాటిని కొంటున్నారు. దీంతో రోగాలు వస్తాయన్న అసలు నిజం వారికి తెలియడం లేదు.

కూర'గాయాలే'..
కూరగాయలు ఒకటీ రెండు మినహా మిగతా వన్నీ కేజీ 60 రూపాయలకు తక్కువ లేవు. ఉల్లి 80 రూపాయలు పలుకుతుండగా క్యారెట్, బీన్స్ వంటివి కేజీ రూ. 60తో విక్రయిస్తున్నారు. ఎండు మిర్చి రూ. 200 మార్కు దాటింది. చింతపండు రూ.140 తక్కువ లేదు. ఒక్క పచ్చిమిర్చి, టమాట మినహా మిగతా వన్నీ రూ.60 పైమాటే ఉన్నాయి.

రిటైల్ మార్కెట్‌లో నిత్యావసరాల ధరలు ఇలా

కేటగిరీ (కేజీకి)	ధర	కేటగిరీ(కేజీకి)	ధర
కందిపప్పు	రూ.160	ఎండుమిర్చి	రూ.200
శనగపప్పు	రూ.120	వేరుశనగ	రూ.140
మినప్పప్పు	రూ.140	క్యారెట్	రూ.60
నూనె	రూ.140	ఉల్లిగడ్డ	రూ.70
పామాయిల్	రూ.135	చింతపండు	రూ.140
పాలు (లీటర్)	రూ.70	బీన్స్	రూ.60

రూ.200 తీసుకుని మార్కెట్‌కు వెళితే నాలుగైదు రకాల కూరగాయలు కూడా సంతృప్తిగా తెచ్చుకోలేని పరిస్థితి ఎదురవుతోంది. ధరల నియంత్రణ చేపట్టకపోవడంతో మార్కెట్‌లో దళారులదే రాజ్యమైంది. పండించే వాళ్లు తక్కువకు ఇస్తున్నా రిటైలర్లు భారీ ధరలకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. సొమ్ము ఒకరిది సోకు ఒకరిది అన్నట్టు పరిస్థితి తయారైంది.

సరుకులు కొనలేకున్నాం



మూడు నెలల నుంచి నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయి. కొనాలంటేనే భయమేస్తోంది. 4 నెలల క్రితం రూ.85 ఉండే నూనె నేడు రూ.140కు చేరుకుంది. కేజీ రూ.150 పలికిన తెల్లగడ్డలు రూ.350కి పెరిగాయి. ఇలాగే, నిత్యావసర సరుకుల ధరలన్నీ కొండెక్కాయి. కూరగాయల ధరలు కూడా ఆకాశాన్నంటి సామాన్య ప్రజలు బెంబేలెత్తుతున్నారు.
– డి.శ్యామల, గృహిణి, శింగనమల

వంట చేసుకుందామంటే భయం



మా లాంటి మధ్య తరగతి వాళ్లు నిత్యావసర సరుకులు కొనలేని పరిస్థితి ఏర్పడింది. మంచి నూనెతో పాటు బెల్లం, ఉప్పు, పసుపు, ఇతర వంట సరుకుల ధరలు అన్నీ పెరిగిపోయాయి. త్వరలో దసరా పండుగ వస్తుంది. ఇప్పుడే ధరలు ఇలా ఉంటే పండుగ పూట ఎలా ఉంటాయోనని భయం వేస్తోంది. ఇంట్లో తీపి వంట ఏదైనా చేసుకుందామన్నా ధరలు చూసి మిన్నకుండిపోవాల్సి వస్తోంది.
– గోవర్ధన్, కళ్యాణదుర్గం

ధరలను నియంత్రించాలి



సామాన్య, పేద, మధ్య తరగతి వారికి అనుకూలంగా నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలను ప్రభుత్వం నియంత్రణ చేయాలి. ఎన్నికల ముందేమో నిత్యావసర సరుకుల ధరలను పెంచబోమని చెప్పే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల అనంతరం ధరలను పెంచి సామాన్యుల నడ్డి విరుస్తున్నాయి. పేదలకు అందుబాటులో ఉండేలా ధరలను తగ్గించి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలి.
– ఈరన్న, తిమ్మాపురం, కంబదూరు మండలం

రైతులకు మెరుగైన సేవలే లక్ష్యం


మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: 'రైతులకు మెరుగైన సేవలు సత్వరం అందించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలి. ముఖ్యంగా నాణ్యమైన డ్రిప్ పరికరాలు అందించాలి. ఇందుకు సంబంధించి లక్ష్యాలను అధిగమించాలి' అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో అధికారులు, రాష్ట, జిల్లాస్థాయి డ్రిప్ కంపెనీల ప్రతినిధులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీఎంఐపీ పథకం అమలులో దేశంలోనే జిల్లా ప్రథమ స్థానంలో ఉండేలా ప్రతి అధికారి బాధ్యతగా కృషి చేయాలన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాకు 37,500 హెక్టార్ల విస్తీర్ణానికి డ్రిప్, స్ప్రింక్లర్లు రాయితీపై రైతులకు అందించాలన్నారు. ఇప్పటి వరకు 48,099 హెక్టార్ల విస్తీర్ణానికి 33,331 మంది రైతులు సంబంధిత రైతు సేవ కేంద్రాల్లో ఆధార్ బయోమెట్రిక్ ద్వారా నమోదు చేసుకున్నారన్నారు. జిల్లాలో 28 డ్రిప్ కంపెనీలు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నాయన్నారు. అర్హత ఉన్న ప్రతి రైతునూ పథకం పరిధిలోకి తీసుకురావాలని వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. 'వికసిత్ ఆంధ్రప్రదేశ్' కార్యక్రమం కింద ఏపీఎంఐపీకి సంబంధించి 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా 7,200 హెక్టార్ల లక్ష్యాన్ని గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమీక్షలో జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి రఘునాథరెడ్డి, జిల్లా ఉద్యానాధికారి నరసింహరావు, ఏపీడీ ఫిరోజ్‌ఖాన్, ఇతర అధికారులు, డ్రిప్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి
అనంతపురం అర్బన్: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని అన్ని విధాల వృద్ధి సాధించాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సూచించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ 2.0 కింద మంజూరు చేసిన ఇళ్లను పూర్తి చేయాలని ఆదేశించారు. పీఎం ఆవాస్ యోజన కింద నిర్మించిన ఇళ్లను ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో వర్చువల్ విధానంలో ప్రారంభించారు. అనంతపురం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వినోద్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం కలెక్టరేట్‌లోని ఎన్ఐసీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పీఎం ఆవాస్ యోజన కింద ఇళ్లను నిర్మించుకున్న 14 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టా, తాళం చెవిని కలెక్టర్ అందజేశారు. నగర పరిధిలో పీఎం ఆవాస్ యోజన కింద గృహాన్ని నిర్మించుకున్న లబ్ధిదారురాలు లక్ష్మీదేవి ఇంటికి కలెక్టర్ వెళ్లి గృహ స్వాధీన పత్రం అందజేశారు.

ఉద్యమంలా స్వచ్ఛతా హీ సేవ



అనంతపురంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్


యాడికి మార్కెట్‌లో శ్రమదానం చేస్తున్న జేసీ శివ నారాయణ శర్మ

అనంతపురం కార్పొరేషన్: 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టి పారిశుధ్యం మెరుగుపరచాలని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు భాగస్వామ్యంతో మంగళవారం నగరంలోని టవర్‌క్లాక్ వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమ ప్రాముఖ్యతను తెలియజేశారు. అనంతరం టవర్‌క్లాక్ నుంచి సప్తగిరి సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 14న ప్రధాని నరేంద్ర మోదీ 'స్వచ్ఛతా హీ సేవ'కు శ్రీకారం చుట్టారన్నారు. ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకూ ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలను భాగస్వాములను చేస్తూ రోజూ ఒక కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నగరంలో ఎక్కడా ప్లాస్టిక్ ఉపయోగించరాదన్నారు. మేయర్ వసీం మాట్లాడుతూ స్వచ్ఛత అందరి బాధ్యత అని అన్నారు. ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఇన్‌చార్జ్ కమిషనర్ పీవీవీఎస్ మూర్తి, అదనపు కమిషనర్ శ్రీహరిబాబు, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, డీఎస్‌డీఓ షఫీ, ఎంహెచ్ఓ డాక్టర్ విష్ణుమూర్తి, కార్పొరేటర్లు శేఖర్‌బాబు, సైఫుల్లాబేగ్, అబూసలేహా, ఇసాక్, రహంతుల్లా, కమల్‌భూషణ్, అనిల్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటిద్దాం
యాడికి: పరిశుభ్రత పాటించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ పిలుపునిచ్చారు. యాడికిలో మంగళవారం 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమం నిర్వహించారు. ఉన్నత పాఠశాల, వాగ్దేవి, విజన్, వివేకానంద, గౌతమి పాఠశాల విద్యార్థులతో కలిసి గాంధీజీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ మాట్లాడుతూ ఇళ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దీంతో ఆరోగ్యంగా ఉంటారన్నారు. 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమంపై ప్రసంగించిన విద్యార్థిని భవ్యశ్రీని జాయింట్ కలెక్టర్ అభినందించారు. అనంతరం ఆయన సంత మార్కెట్‌లో పారిశుధ్య కార్మికులతో కలిసి శ్రమదానం చేశారు. కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్ రావు, జెడ్పీ సీఈఓ ఓబులమ్మ, పీడీ రామాంజనేయులు, తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి, ఎంపీడీఓ లక్ష్మినారాయణ, ఈఓపీఆర్డీ వెంకటేష్, గ్రామ సర్పంచు అనురాధ, ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, ఎంపీటీసీలు వెంకటనాయుడు, నాగరాజు, రామ్మోహన్, ఎంఈఓ కాశెప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి
అనంతపురం మెడికల్: విద్యార్థి దశ నుంచే ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నగరంలోని రాజేంద్ర నగరపాలక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కలెక్టర్ అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భయాందోళన చెందకుండా మాత్రలు వేసుకోవాలన్నారు. డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబ దేవి మాట్లాడుతూ అల్బెండజోల్ మాత్రలు తీసుకుంటే పిల్లల్లో నులిపురుగులు నశించి ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో జెడ్పీచైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, డీఈఓ వరలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్, ఆర్‌బీఎస్‌కే జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ నారాయణస్వామి, ఎంహెచ్ఓ డాక్టర్ విష్ణుమూర్తి, తహసీల్దార్ హరికుమార్, ఆరోగ్య శాఖ సిబ్బంది గంగాధర్ పాల్గొన్నారు.

పొలం బాట పట్టిన అధికారులు



అనంతపురం అగ్రికల్చర్: 'పంట' పోతున్నా పట్టించుకోరా? శీర్షికతో సోమవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి వ్యవసాయశాఖ స్పందించింది. అధికారులు, శాస్త్రవేత్తలు సంయుక్తంగా పంట పొలాల పరిశీలనకు రంగంలోకి దిగారు. జిల్లా వనరుల కేంద్రం (డీఆర్‌సీ) డీడీఏ, ఆత్మ పీడీ మద్దిలేటి, డీఆర్‌సీ ఏఓ శైలజ, రైతు శిక్షణా కేంద్రం (ఎఫ్‌టీసీ) ఏఓ శ్రీనివాసులు, పామిడి ఏఓ లీనా, వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ రమేష్‌నాయక్, డాక్టర్ కిషోర్‌రెడ్డితో కూడిన డయాగ్నస్టిక్ బృందం మంగళవారం పెద్దవడుగూరు, పామిడి మండలాల్లో క్షేత్రస్థాయి పర్యటన చేపట్టారు. బెట్ట పరిస్థితి ఎదుర్కొంటున్న పత్తి పంటలో 5 గ్రాములు పొటాషియం నైట్రేట్ + 1 గ్రాము బోరాన్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. గులాబీ రంగు కాయతొలచు పురుగు నివారణకు ఎకరాకు 10 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పురుగు ఉధృతిని బట్టి 1 మి.లీ లామ్డా సైహలోత్రిన్ లేదా 0.5 మి.లీ అమిప్లిగో లేదా 1.5 మి.లీ పైరిడాలిల్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.

మార్కెట్‌కు మహాలయ కళ

మహాలయ పౌర్ణమికి పొట్టేళ్లు, కోళ్లు కొనేందుకు వచ్చిన వారితో అనంతపురం నగరం మంగళవారం కళకళలాడింది. జీవాల కొనుగోలుదారులు, విక్రయదారులతో నాలుగో రోడ్డులో సందడి నెలకొంది.
– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం




గొర్రెలు, పొట్టేళ్లు కొనుగోలు చేస్తున్న దృశ్యం (ఇన్‌సెట్‌లో) కోళ్ల అమ్మకాలు

విద్యార్థుల ఆశలపై నీళ్లు



మా అన్న కుమార్తె బైపీసీ చదువుతోంది. జగనన్న ప్రభుత్వంలో కొత్తగా మెడికల్ కళాశాలలు ఏర్పాటు కావడంతో మెడిసిన్ చదివించాలని ఆశపడ్డాం. దీంతో నీట్ పరీక్షకు అమ్మాయి ఇప్పటి నుంచే సిద్ధమవుతోంది. అయితే మా ఆశలపై కూటమి ప్రభుత్వం నీళ్లు చల్లింది. గత ప్రభుత్వం 17 మెడికల్ కాలేజీలకు అనుమతులు తీసుకువచ్చి సొంత భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకుంది. ఇందులో ఐదు కళాశాలలు ప్రారంభమయ్యాయి. మరో ఏడు కళాశాలలు వచ్చే ఏడాది ప్రారంభించాల్సి ఉంది. ఆ దిశగా సీఎం చంద్రబాబు చర్యలు తీసుకోకుండా వైద్యవిద్యను ప్రైవేట్ పరం చేయాలని చూడడం ఆయన చేతకాని తనానికి నిదర్శనం.

–ఎం.అనిల్‌కుమార్, ఎస్కేయూ క్యాంపస్ పీజీ విద్యార్థి



అ'సత్య' వ్యాఖ్యలు సిగ్గుచేటు



జగనన్న ప్రభుత్వంలో కొత్తగా 17 మెడికల్ కళాశాలలకు అనుమతులు సాధించి ఐదు కళాశాలలను గత ఏడాది ప్రారంభించారు. ఈ ఏడాది ఐదు, వచ్చే ఏడాది మరో ఏడు కళాశాలలను ప్రారంభించాల్సి ఉంది. ఆ దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టక పోగా వైద్య విద్యను ప్రైవేటీకరణ చేసే దిశగా అడుగులేయడం బాధాకరం. క్షేత్రస్థాయిలో ఎలాంటి పరిశీలనలు చేపట్టకుండానే ప్రొఫెసర్లు లేరు, భవనాలు లేవు, ఎవరు బోధిస్తారు.. అంటూ ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ వ్యాఖ్యానించడం ఆయన అవగాహనారాహిత్యానికి నిదర్శనం. ఆయన సత్యం మాట్లాడడం నేర్చుకోవాలి. పేద విద్యార్థులు మెడిసిన్ చదవకూడదన్నది సీఎం చంద్రబాబు లక్ష్యంగా స్పష్టమవుతోంది.

– నడిమింటి కిరణ్, ఎస్కేయూ క్యాంపస్ పీజీ విద్యార్థి

క్లుప్తంగా

కేజీబీవీలో జీసీడీఓ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న జీసీడీఓ వాణీదేవి

శెట్టూరు: స్థానిక కేజీబీవీని జీసీడీఓ వాణీదేవి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలోని సిబ్బంది, విద్యార్థుల హాజరుపట్టీని పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్, నిల్వ, మిగులు, ఆహారంలో నాణ్యతను తనిఖీ చేశారు. విద్యార్థులు ఆరోగ్య వివరాలు, హెల్త్ చెకాప్ అంశాలపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ... బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై చైతన్య పరిచారు. చదువుకుంటే జీవితంలో ఎవరి మీద ఆధారపడకుండా జీవించవచ్చునన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ లలిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతపై దాడి

తాడిపత్రి అర్బన్: పాతకక్షల నేపథ్యంలో సోమవారం అర్ధరాత్రి తాడిపత్రికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత జబ్బార్‌పై దాడి జరిగింది. సీఐ సాయిప్రసాద్ తెలిపిన మేరకు... జబ్బార్, తోళ్ల మాబు, తోళ్ల షఫీ మధ్య మనస్పర్ధలున్నాయి. తాజాగా సోమవారం అర్ధరాత్రి కాల్వగడ్డ వీధిలో తమకు ఎదురుపడిన జబ్బార్‌పై మాబు, షఫీ దాడి చేశారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

150 అరటి మొక్కల నరికివేత



అరటి మొక్కలను పరిశీలిస్తున్న పోలీసులు

పుట్లూరు: మండలంలోని కుమ్మనమలలో రైతులు ఓబుళకొండయ్య, శ్రీనివాసులుకు చెందిన అరటి తోటల్లో మంగళవారం 150 మొక్కలను దుండగులు నరికి వేశారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ హేమాద్రి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌ను రప్పించి ఆధారాల కోసం అన్వేషించారు. రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆర్‌ఎంపీ వైద్యం వికటించి వ్యక్తి మృతి

పామిడి: మండలంలోని ఎద్దులపల్లిలో ఆర్‌ఎంపీ వైద్యం వికటించి మంగళవారం ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు ఎద్దులపల్లికి చెందిన ఆదినారాయణ (50) తీవ్రమైన రక్తపోటుతో బాధపడుతూ మంగళవారం ఆ గ్రామ ఆర్‌ఎంపీ వద్దకు చికిత్స కోసం వెళ్లాడు. ఆ సమయంలో ఇంజక్షన్ వేసిన కొద్ది సేపటికే తీవ్ర అస్వస్థతకు లోనైన ఆదినారాయణను కుటుంబసభ్యులు హుటాహుటిన పామిడిలోని సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య చౌడమ్మ, ముగ్గురు కుమారులు ఉన్నారు. కాగా, ఈ ఘటనకు సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఆకాశంలో అద్భుతం

ఆకాశంలో అద్భుతం ఆవిష్కృతమైంది. మంగళవారం రాత్రి 7 నుంచి 7.30 గంటల మధ్యలో భూమికి దగ్గరగా చంద్రుడు కనిపించి ఆకట్టుకున్నాడు. ఈ ఏడాది వరుసగా సంభవించే నాలుగు సూపర్ మూన్‌లలో ఇది రెండవది కావడం గమనార్హం. అతి పెద్దగా, అత్యంత ప్రకాశవంతంగా కనిపించిన చంద్రుడిని చూస్తూ మైమరిచిన పలువురు తమ సెల్‌ఫోన్లలో బంధించి సంబరపడ్డారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



అతిపెద్దగా కనిపిస్తున్న చంద్రుడు



చంద్రుడు వస్తున్న వేళ అరుణ వర్ణంతో మెరిసిపోతున్న ఆకాశం



మబ్బుల్ని చీల్చుకుంటూ పైకి వస్తున్న చంద్రుడు

ఈ–కేవైసీ వేగవంతం చేయండి : జేసీ



ఈ-కేవైసీ నమోదును పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ

యాడికి: రైతుల ఈ-కేవైసీ నమోదును వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ ఆదేశించారు. యాడికి మండలం నిట్టూరు గ్రామంలో మంగళవారం చేపట్టిన రైతుల ఈ-కేవైసీ అథంటికేషన్ ప్రక్రియను ఆయన పరిశీలించి, మాట్లాడారు. పరిశీలిచారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రతాపరెడ్డి, వ్యవసాయాధికారి మహబూబ్‌బాషా, ఆర్‌ఐ ఆనందబాబు ఆచారి, గ్రామ వ్యవసాయ సహాయ అధికారి ఫయాజ్ పాల్గొన్నారు.

గోదాము తనిఖీ

తాడిపత్రి రూరల్: మండలంలోని పౌరసరఫరాల శాఖ గోదామును మంగళవారం జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్టాక్ రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. సీసీ కెమెరాల పనితీరుపై ఆరా తీశారు. తూకాల్లో తేడాలు రాకుండా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ రమేష్‌రెడ్డి ఉన్నారు.

రికార్డుల పరిశీలన

రికార్డుల నిర్వహణ క్రమ పద్ధతిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ కార్యాలయ సిబ్బందిని జేసీ ఆదేశించారు. ఈ-కేవైసీ ప్రక్రియ పరిశీలన అనంతరం ఆయన తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డుల గదికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చొరవ తీసుకోవాలన్నారు. కార్యాలయం పరిసరాలను శుభ్రం ఉంచాలని సూచించారు.

చిరుత దాడిలో గేదె మృతి

కుందుర్పి: చిరుత దాడిలో ఓ గేదె మృతి చెందింది. వివరాలు... కుందుర్పి మండలం కెంచంపల్లికి చెందిన రైతు రామాంజనేయులు వ్యవసాయంతో పాటు పాడి పోషణతో జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం తన పాడి పశువులను మేపునకు తోలుకెళ్లినప్పుడు అటవీ శివారు ప్రాంతం నుంచి ఓ చిరుత గేదెపై దాడి చేసి హతమార్చింది. ఘటనపై అటవీ శాఖ అధికారులు ఆరా తీస్తున్నారు.

విశ్వకర్మ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్ (చిత్రంలో) జెడ్పీచైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తదితరులు

అనంతపురం రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. అనంతపురంలోని పాతూరు వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో మంగళవారం బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కలెక్టర్ మాట్లాడుతూ.. చేతివృత్తిదారుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న చర్యలను వివరించారు. అర్హులైన చేతివృత్తి దారులందరికీ గుర్తింపు కార్డులు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కరరెడ్డి, వాసంతిసాహిత్య, బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బుకొఠారి, అనంతపురం అర్బన్ తహసీల్దార్ హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలను కబళిస్తోంది

- 15 ఏళ్ల ప్రాయంలోనే అరుదైన వ్యాధి బారిన పడిన విద్యార్థి
- 19 ఏళ్లకే నడవలేక మంచానికే పరిమితమైన వైనం
- పొలం, బంగారు నగలు అమ్మినా చికిత్సకు సరిపోని డబ్బు
- దాతలు స్పందించి ప్రాణభిక్ష పెట్టాలంటున్న తల్లిదండ్రులు

అందరిలా ఆడుతూ... పాడుతూ.. చదువుకుంటున్న ఆ బాలుడు ఒక్కసారిగా అనారోగ్యానికి గురయ్యాడు. చూస్తుండగానే నెలల వ్యవధిలోనే ఆరోగ్య పరిస్థితి పూర్తిగా విషమించి మంచాన పడ్డాడు. చికిత్స కోసం బాలుడిని తీసుకుని తల్లిదండ్రులు తిరగని ఆస్పత్రి అంటూ లేదు. అయినా వ్యాధి నయం కాలేదు. చివరకు బెంగళూరుకు తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు చెప్పిన మాటలు వినగానే తల్లిదండ్రుల నెత్తిన పిడుగుపడినట్లైంది. అరుదైన వ్యాధితో మృత్యువుకు చేరువవుతున్న తమ కుమారుడిని కాపాడే ఆపన్నహస్తం కోసం ఆ నిరుపేద తల్లిదండ్రులు ఎదురు చూస్తున్నారు.



మంచానికే పరిమితమైన విష్ణువర్ధన్‌కు సపర్యలు చేస్తున్న తల్లిదండ్రులు

ఆత్మకూరు: మండలంలోని సనప గ్రామానికి చెందిన శివమ్మ, వెంకటేష్ దంపతుల కుమారుడు విష్ణువర్ధన్‌కు ప్రస్తుతం 19 సంవత్సరాల వయస్సు. పదో తరగతి చదువుతున్న సమయంలో కీళ్లు, ఒళ్లు నొప్పులు అంటూ జ్వరం బారిన పడ్డాడు. తల్లిదండ్రులు వెంటనే అనంతపురంలోని ఆస్పత్రికి తీసుకెళ్లి చూపించారు. సాధారణ జ్వరమేనంటూ వైద్యులు చికిత్స అందజేశారు. అయితే రోజులు గడుస్తున్నా... విష్ణువర్ధన్ ఆరోగ్య పరిస్థితిలో మార్పు రాలేదు. జ్వర తీవ్రత తగ్గినా ఇతర అనారోగ్య లక్షణాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తూ ఇబ్బంది పెడుతూ వచ్చాయి. దీంతో చివరకు బడికి వెళ్లలేని స్థితికి చేరుకున్నాడు. ఈ నేపథ్యంలోనే 2019లో కిడ్నీ, గుండె సంబంధిత వ్యాధులు బయటపడ్డాయి. దీంతో అదే ఏడాది బెంగళూరులోని ఓ ప్రముఖ ఆస్పత్రికి కుమారుడిని తల్లిదండ్రులు తీసుకెళ్లారు. అక్కడ అన్ని రకాల వైద్య పరీక్షల నిర్వహించిన అనంతరం సిస్టమిక్ లూపస్ ఎరిత్మాటోసస్ (ఎస్‌ఎల్‌ఈ) వ్యాధితో విష్ణువర్ధన్ బాధపడుతున్నట్లుగా వైద్యులు నిర్ధారించారు. 'కంచే చేను మేసినట్లు'గా ఈ వ్యాధిగ్రస్తుల్లోని రోగనిరోధక వ్యవస్థ శరీరంలోని ఆరోగ్యకరమైన కణజాలంపై దాడి చేస్తుందని, దీని ప్రభావిత అవయవాలలో కణజాల నష్టం జరుగుతుందని వైద్యులు తెలిపారు. సకాలంలో వ్యాధిని గుర్తించకపోతే కీళ్ళు, చర్మం, మెదడు, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, రక్తనాళాలను ప్రభావితం చేస్తూ రోగి మరణానికి దారి తీస్తుందని వివరించారు.

ఉన్నదంతా ఊడ్చి పెట్టినా...

తమ ఒక్కగానొక్క కుమారుడిని అరుదైన వ్యాధి రూపంలో కబళిస్తున్న మృత్యువు గురించి తెలుసుకోగానే తల్లిదండ్రులు ఒక్కసారిగా కుదేలయ్యారు. ఈ క్రమంలోనే రెండేళ్ల క్రితం గుండె, కిడ్నీ సంబంధిత సమస్యలు ఉత్పన్నం కావడంతో మరోసారి బెంగళూరులోని ఆస్పత్రికి తల్లిదండ్రులు తీసుకెళ్లారు. గుండెకు వెంటనే శస్త్రచికిత్స చేయాలని, లేకుంటే ప్రాణాపాయం తప్పదని అక్కడి వైద్యులు తెలపడంతో ఊళ్లో తమకున్న 1.50 ఎకరాల పొలాన్ని, 8 తులాల బంగారు నగలు అమ్మి డబ్బు సమకూర్చుకుని శస్త్రచికిత్స చేయించారు. అనంతరం వైద్య చికిత్సల కోసం కొన్ని నెలలు అక్కడే ఉండాల్సి వచ్చింది. ఈ క్రమంలో చేతిలో ఉన్నదంతా తుడిచి పెట్టుకుపోవడంతో చివరకు కట్టుబట్టలతో కుమారుడిని పిలుచుకుని ఇంటికి చేరుకున్నారు.

మోకాళ్లు క్షీణించి...

ఇంటికి చేరుకున్న కొన్ని రోజుల్లోనే విష్ణువర్ధన్ నడవలేని స్థితికి చేరుకున్నాడు. వైద్య పరీక్షల అనంతరం మోకాళ్లకు శస్త్రచికిత్స చేయాలని వైద్యులు తెలిపారు. ఇందుకు రూ.4 లక్షల వరకూ ఖర్చు వస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికే తమ వద్ద ఉన్నదంతా విక్రయించి కూలి పనులతో జీవనం సాగిస్తున్న వారికి అంత పెద్ద మొత్తంలో డబ్బు సమకూర్చడం తలకు మించిన భారమైంది. దీనికి తోడు ప్రతి నెలా చికిత్స కోసం ఓ ప్రైవేట్ (ప్రభుత్వాస్పత్రిలో లేదన్నారు) ఆస్పత్రికి వెళ్లక తప్పడం లేదు. చికిత్స కోసం వెళ్లిన ప్రతి సారీ రూ.40 వేల వరకు ఖర్చు వస్తోంది. ఇలాంటి తరుణంలో దాతలు ముందుకు వచ్చి సహకరిస్తే తప్ప తమ కుమారుడి మోకాళ్ల శస్త్రచికిత్స జరిగే పరిస్థితి లేదని ఆ నిరుపేద తల్లిదండ్రులు అంటున్నారు. తమ కుమారుడికి ప్రాణభిక్ష పెట్టాలని వేడుకుంటున్నారు.

సాయం చేయదలిస్తే...

పేరు	: మంగలి వెంకటేష్
బ్యాంక్ పేరు	: యూనియన్ బ్యాంక్, రామ్‌నగర్ శాఖ, అనంతపురం
బ్యాంక్ ఖాతా:	0217 1010 002 9145
ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ :	UBIN0802174
ఫోన్ పే నంబర్:	96765 08628

పత్తిలో తెగుళ్ల పరిశీలన



పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పెద్దవడుగూరు/పామిడి/బుక్కరాయసముద్రం: పత్తి పంటలో తెగుళ్ల నివారణపై దృష్టి సారించాలని రైతులకు వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ రమేష్‌నాయక్, డాక్టర్ కిషోర్‌రెడ్డి, ఆత్మ పీడీ మద్దిలేటి సూచించారు. డిస్ట్రిక్ రీసోర్స్ సెంటర్ అధికారి శైలజ, జిల్లా రైతు శిక్షణా కేంద్రం అధికారి శ్రీనివాసులుతో కలసి మంగళవారం పెద్దవడుగూరు, చిన్నవడుగూరు, దిమ్మగుడి, పామిడి, నీలూరు, దిమ్మగుడి, చిట్టూరు తదితర గ్రామాల్లో వారు పర్యటించారు. కొర్ర, పత్తి పంటలను పరిశీలించారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల కారణంగా బెట్టను పత్తి పంట తట్టుకునే చర్యలను వివరించారు. ఒక లీటరు నీటికి 5 గ్రాముల పొటాషియం, 3 గ్రాముల బోరాన్ మిక్చర్ కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే గులాబీ రంగు పురుగు ఉధృతి నివారణకు ఎకరాకు పది చొప్పున లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలని సూచించారు. కంది పంటలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఓ మల్లీశ్వరి, పామిడి ఏఓ లీనా, విస్తరణ అధికారి ప్రసాద్, ఆర్‌ఎస్‌కే రామచంద్ర , రైతులు సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచ్‌పై టీడీపీ నాయకుల దౌర్జన్యం



వివరాలు తెలుసుకుంటున్న తహసీల్దార్ పుణ్యవతి, సీఐ కరుణాకర్

బుక్కరాయసముద్రం: పాత కక్షల నేపథ్యంలో బీకేఎస్ మండలం చెదుళ్ల గ్రామ సర్పంచ్ శ్రీనివాసరెడ్డిపై అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు మంగళవారం దౌర్జన్యానికి తెగబడ్డారు. 2021లో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుగా శ్రీనివాసరెడ్డి, టీడీపీ మద్దతుదారుగా నారాయణస్వామి బరిలోకి దిగారు. అయితే నారాయణస్వామికి నలుగురు పిల్లలు ఉండడంతో ఆయన నామినేషన్‌ను అప్పట్లో అధికారులు తిరస్కరించారు. దీంతో శ్రీనివాసరెడ్డి ఎన్నిక ఏకగ్రీవమైంది. అప్పటి నుంచి శ్రీనివాసరెడ్డిపై టీడీపీ నేతలు కక్షపూరితంగానే వ్యవహరిస్తూ వచ్చారు. 2021లో శ్రీనివాసరెడ్డికి చెదుళ్లలో సర్వే నంబర్ 113–1లో 2.50 సెంట్ల భూమికి అప్పటి అధికారులు పట్టానిచ్చారు. ఇందులో ఆయన వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి గ్రామంలో పేదలకు శుద్ధినీటిని అందిస్తూ వస్తున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత శ్రీనివాసరెడ్డిపై టీడీపీ నేతల కక్ష సాధింపులు తారస్థాయికి చేరుకున్నాయి. శ్రీనివాసరెడ్డికి ఇచ్చిన ఇంటి పట్టాను సంఘాలకు కేటాయించామని వాటిలో ఉన్న వాటర్ ప్లాంట్‌ను తొలగించాలని టీడీపీ నాయకుడు నారాయణస్వామి పట్టుబట్టి మంగళవారం దౌర్జన్యంగా జేసీబీతో ప్లాంట్‌ను కూలదోసేందుకు ప్రయత్నించాడు. విషయం తెలుసుకున్న సీఐ కరుణాకర్, తహసీల్దార్ పుణ్యవతి అక్కడకు చేరుకుని పరిశీలించారు. అదే సమయంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ నేతలు దాడికి పూనుకోవడంతో పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు.

బట్టబయలైన టీడీపీ నేతల ఇసుక దందా



కంబదూరులో సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

సాక్షి ఎఫెక్ట్..

కంబదూరు/గుమ్మఘట్ట/రాయదుర్గం టౌన్/: టీడీపీ నేతల ఇసుక దందా బట్టబయలైంది. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న టీడీపీ నేతల ట్రాక్టర్లను పోలీసులు ఎక్కడికక్కడ సీజ్ చేశారు. టీడీపీ నేతలు సాగిస్తున్న ఇసుక అక్రమ దందాపై 'ఇసుక తోడేళ్లు... రెచ్చిపోతున్న పచ్చ నాయకులు' శీర్షికన మంగళవారం 'సాక్షి'లో కథనం వెలువడింది. దీనిపై స్పందించిన జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసులు రంగంలో దిగారు. కంబదూరులో రెండు ఇసుక ట్రాక్టర్లను ఎస్‌ఐ ఆంజనేయులు సీజ్ చేశారు. అలాగే గుమ్మఘట్ట మండలం భూపసముద్రం వద్ద ఉన్న వేదవతి హగరి పరివాహక ప్రాంతం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఆ మండల ఎస్‌ఐ ఈశ్వరయ్య సీజ్ చేశారు. ఈ నాలుగు ట్రాక్టర్లు టీడీపీ నేతలకు చెందినవే కావడం గమనార్హం. అనధికారికంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను రాయదుర్గం శివారులో రూరల్ సీఐ రమణ సీజ్ చేశారు. కాగా, కంబదూరులో ఇసుక ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేసిన వెంటనే టీడీపీ నాయకులు హడావుడి చేశారు. అప్పటికప్పుడు మండల పరిషత్ అధికారులతో అనుమతులు రాయించుకుని పోలీసులకు చూపించి తమ ట్రాక్టర్లను విడిపించుకెళ్లారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

బెళుగుప్ప: తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను బెళుగుప్ప పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను మంగళవారం మీడియాకు ఎస్‌ఐ శివతో కలసి సీఐ ప్రవీణ్‌కుమార్ వెల్లడించారు. బెళుగుప్ప మండల పరిధిలోని పలు ఇళ్లలో ఇటీవల జరిగిన చోరీ కేసులకు సంబంధించి పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో మంగళవారం గుండ్లపల్లి క్రాస్ వద్ద అనుమానాస్పదంగా తచ్చాడుతున్న కర్ణాటకలోని హావేరి జిల్లా రాణిబెన్నూరుకు చెందిన బోయ పరుశురాంను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయడంతో చోరీ కేసులు వెలుగు చూశాయి. జల్సాలకు అలవాటు పడిన పరుశురాం పలు దొంగతనాల కేసుల్లో పట్టుబడి కర్ణాటకలోనే జైలు జీవితం గడిపాడు. ఈ ఏడాది జూన్‌లో విడుదలై వచ్చిన వెంటనే జూలై, ఆగస్టు మాసాల్లో కళ్యాణదుర్గం, ఉరవకొండ, కర్నూలు జిల్లా ఆలూరు, బెళుగుప్ప మండలంలో పలు చోరీలకు పాల్పడ్డాడు. నిందితుడి నుంచి 40 గ్రాముల బంగారు నగలు, రూ.27వేల నగదు స్వాధీనం చేసుకుని, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

యువకుడి ఆత్మహత్య

తాడిపత్రి రూరల్: మండలంలోని అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన అమరేష్(33) మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. అల్ట్రాటెక్ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తూనే తనకున్న రెండు ఎకరాల పొలంలో వ్యవసాయం చేసేవాడు. ఈ క్రమంలోనే పంటల సాగుకు చేసిన అప్పులకు వడ్డీల భారం పెరగడంతో మనస్తాపం చెంది మామిడి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై తాడిపత్రి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

రోగ నిర్ధారణ తప్పనిసరి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి

అనంతపురం మెడికల్: రోగ నిర్ధారణ అయితే సరైన వైద్యం అందించి సకాలంలో కోలుకునేలా చర్యలు తీసుకోవచ్చని డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి పేర్కొన్నారు. మంగళవారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ప్రపంచ పేషంట్ సేఫ్టీ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏ వ్యాధికైనా నిర్ధారణ ముఖ్యమన్నారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్, డీన్ డాక్టర్ మాణిక్యరావు, సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బోధనాస్పత్రిలో వ్యాధి నిర్ధారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, నర్సింగ్ సూపరింటెండెంట్ నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

ఈ-కేవైసీ చేయించుకోండి

ఆత్మకూరు: ఖరీఫ్ పంటల సాగుకు సంబంధించి ఈనెల 23లోపు ఈ క్రాప్ బుకింగ్, ఈ-కేవైసీ చేయించుకోవాలని ఏఓ సుచరిత రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో ఈ-కేవైసీ నిర్వహించినట్లు తెలియజేశారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన

రాప్తాడురూరల్: రాప్తాడు మండలం చిన్మయ నగర్‌లోని టిడ్కో ఇళ్లు, అనంతపురం రూరల్ మండలం కురుగుంట హౌసింగ్‌కాలనీలోని ఇళ్ల నిర్మాణాలను కలెక్టర్ వినోద్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. టిడ్కో ఈఈ ఆదినారాయణతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. 2018-19లో చేపట్టిన 2,304 ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయి. కలెక్టర్ వెంట హౌసింగ్ పీడీ శైలజ, అనంతపురం రూరల్, రాప్తాడు మండలాల తహసీల్దార్లు మోహన్‌కుమార్, విజయ కుమారి, హౌసింగ్ డీఈ కృష్ణారావు, హౌసింగ్ సిబ్బంది ఉన్నారు.

20 నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడా ఎంపిక పోటీలు

ఆత్మకూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 20,21 తేదీల్లో విద్యార్థులకు ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో క్రీడా ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. ఈమేరకు ఎస్‌జీఎఫ్ మండల కోఆర్డినేటర్ నాగరాజు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అండర్ 14,17 విభాగాలోల బాల బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్, బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్, చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటలకు పోటీలు నిర్వహిస్తామని, ఆసక్తి ఉన్న విద్యార్థులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షునిగా కేశవరెడ్డి



కేశవరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం: అనంతపురం క్లబ్‌లో సోమవారం టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం ఎంపికపై సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షునిగా పి.కేశవరెడ్డి, ఉపాధ్యక్షులుగా కేవీ పాండురంగయ్య, కేజే అరుణ్, కార్యదర్శిగా ఎం.శ్రీనివాసరెడ్డి, జాయింట్ సెక్రెటరీగా గల్లా హర్ష, జొన్నా సత్యం, ట్రెజరర్‌గా మేడా రాజేష్, ఈసీ మెంబర్లు వి.రఘునాథరెడ్డి, సీఎస్ ప్రసాద్, ఆర్.రాజేంద్రనాథ్, నరసింహులు, అగిశం రంగనాథ్‌ను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శులను అభినందించారు.

క్రీడాకారులను తయారు చేసే బాధ్యత మీదే



వ్యాయామ ఉపాధ్యాయులతో డీఈఓ వరలక్ష్మీ

రాప్తాడు: విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దే బాధ్యత పీఈటీలపై ఉందని డీఈఓ వరలక్ష్మి అన్నారు. బుధవారం రాప్తాడులో నియోజకవర్గస్థాయిలో రాప్తాడు, ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాల్లోని వ్యాయామ ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని డీఈఓ ఆకస్మికంగా పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం వల్ల మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం పెంపొందుతుందన్నారు. విద్యార్థులు చదువు ఒక్కటే కాకుండా క్రీడల్లో సాధన చేసి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ మల్లికార్జున, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ సాంబశివుడు, మండల కోఆర్డినేటర్లు కేశవమూర్తి, రాజశేఖర్ రెడ్డి, సిరాజ్, ముస్తాఫా, సునీత, జగదీష్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వైద్య విద్యను దూరం చేసే కుట్ర

“ రాష్ట్రంలోని పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయాలని కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోంది. ఇందులో భాగంగానే వైద్య కళాశాలలు వద్దంటూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. తెలుగు రాష్ట్రాలలో అనేకమంది విద్యార్థులు డాక్టర్ కోర్సు చేయాలన్న ఆశలను, లక్ష్యాలను చిదిమేయాలని చూస్తోంది. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయడాన్ని అడ్డుకుంటాం.

– జి.వీరేంద్రప్రసాద్, జిల్లా ప్రధానకార్యదర్శి, పీడీఎస్‌యూ



వైద్య విద్యకు చంద్రగ్రహణం

కోటి ఆశలతో డాక్టర్ కావాలని లక్షల రూపాయలు ఖర్చు చేసి నీట్ కోచింగ్ తీసుకొని చదువుతున్న విద్యార్థుల ఆశలను రాష్ట్ర ప్రభుత్వం అడియాసలు చేస్తోంది. గత ప్రభుత్వం నూతన కళాశాలలు మంజూరు చేయించి.. కొన్ని నిర్మాణాలు పూర్తి చేస్తే ప్రస్తుత ప్రభుత్వం వాటిని ప్రారంభించకపోవడం విచారకరం. 700 సీట్లు రద్దు కోసం ఎన్ఎంసీకి లేఖ రాయడం దుర్మార్గం. ప్రభుత్వ వైద్యవిద్యకు సీఎం చంద్రబాబు ఒక గ్రహణంలా పట్టి పీడిస్తున్నారు.

– భీమేష్, ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షుడు, అనంతపురం ”





బాత్‌రూం నుంచి వెదజల్లుతున్న దుర్గంధాన్ని తాళలేక పరుగు తీస్తున్న ప్రయాణికుడు

● అపరిశుభ్రతకు పరాకాష్ట

ఆర్టీసీ అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో అనంతపురం బస్టాండ్ ఆవరణ మొత్తం దుర్గంధమయమైంది. టాయిలెట్‌కెళ్లి విసర్జించిన మూత్రం మొత్తం రోడ్డు పైకి వస్తోంది. చెత్తను సైతం తొలగించకపోవడంతో అపరిశుభ్రత పరాకాష్టకు చేరుకుంది. నిర్వహణ లోపం కారణంగా ఏర్పడిన గోతులను పెద్దపెద్ద బండ రాళ్లతో పూడ్చారు. ఇది మరింత ప్రమాదకరంగా మారింది. ఈ పరిస్థితిని చూసిన ఇతర జిల్లాల ప్రయాణికులు 'అయ్య బాబోయ్ ఇదెక్కడి బస్టాండ్' అంటూ ఏవగించుకుంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో గుంతలు పూడ్చడానికి వేసిన పెద్ద రాళ్లు



బస్టాండ్ ఎదుట డ్రైనేజీ దుస్థితి

రోడ్లపై చెత్త కన్పించరాదు



పాతూరులో రోడ్డుపై ఉన్న చెత్తను ఊడ్చేందుకు వెళ్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నగరంలోని పాతూరులో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, తదితరులు రోడ్లు ఊడ్చారు. రోడ్డుపై చెత్త కన్పించకూడదని, ప్రజలు కూడా ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకూడదని మేయర్ సూచించారు. మునిసిపల్ ఆర్‌డీ, ఇన్‌చార్జ్ కమిషనర్ పీవీవీఎస్ మూర్తి మాట్లాడుతూ వచ్చే నెల రెండో తేదీ వరకు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తి, కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణతో ఆరోగ్యం



కనగానపల్లి విద్యార్థులకు మాత్రలు వేస్తున్న ఆరోగ్య సిబ్బంది



ఆత్మకూరు కేజీబీవీలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ప్రిన్స్‌పాల్ లీమారోజ్



రాప్తాడు అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేస్తున్న దృశ్యం

రాప్తాడు: నులి పురుగుల నివారణతోనే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరత్న అన్నారు. మంగళవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒకటి నుంచి 19 ఏళ్ల బాల, బాలికల్లో నులి పురుగుల వ్యాప్తి అధికంగా ఉంటుందన్నారు. ఆల్బెండజోల్ మాత్రలను చంపరించి మింగటం వల్ల నులిపురుగులు తొలగిపోయి రక్తహీనత నుంచి కోలుకుంటారన్నారు. అనంతరం రాప్తాడులోని అంగన్‌వాడీ కేంద్రంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. అనంతరం పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు.

ఆత్మకూరు: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులకు మంగళవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను అందజేశారు. 19 సంవత్సరాల లోపు వయసు లోపు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ మాత్రలు వేసుకోవడం మంచిదని వైద్య సిబ్బంది తెలియజేశారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్స్‌పాల్ లీమారోజ్, పిహెచ్ఎన్ తులసమ్మ, ఎంపీహెచ్ఎస్ రత్నమ్మ, సీహెచ్‌ఓ ప్రీతి, ఏఎన్ఎమ్ అలివేలమ్మ, ఏఎన్ఎమ్ సౌజన్య పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: నులిపురుగులను ఆల్బెండజోల్ మాత్రలతో నివారించవచ్చని వైద్య సిబ్బంది పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో మంగళవారం చిన్నారులకు నులిపురుగుల నివారణ మాత్రలను వేశారు. ఎన్ఎస్‌గేట్ పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ రవినాయక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైద్య సిబ్బందితో పాటు ఆయా పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.

కనగానపల్లి: మండలంలోని ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుకొంటున్న 98 శాతం మంది విద్యార్థులకు మంగళవారం నులిపురుగుల నివారణ మాత్రలు వేసినట్లు పీహెచ్‌సీ డాక్టర్ చెన్నారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, హెల్త్‌సూపర్‌వైజర్లు, హెల్త్‌అసిస్టెంట్లు, ఏఎన్ఎం, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దాం



ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ప్రతిజ్ఞ చేయిస్తున్న డ్వామా ఏపీడీ సుధాకర్ రెడ్డి

రాప్తాడు: పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దామని డ్వామా అడిషనల్ పీడీ సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన రాప్తాడులో ఉపాధి హామీ కింద మా కా నాం ఏక్ ప్లాంట్ అనే కార్యక్రమంలో భాగంగా తలారి లక్ష్మీ నారాయణపాలంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ చెట్లను విచ్చలవిడిగా నరికి వేయడం వల్ల కాలుష్యం పెరిగిపోయి జీవకోటి మనుగడ ప్రశ్నార్థకమవుతోందన్నారు. చెట్లను విరివిగా నాటి ప్రతి గ్రామాన్ని ఒక ఉద్యాన వనంగా చేయాలని కోరారు. మొక్కలు నాటి పెంచడం అనేది ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. విలువైన మొక్కలను పరిరక్షించుకోకపోతే మానవ మనుగడే లేదని ఆయన హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. ఏపీడీ అనూరాధ, ఎంపీడీఓ సాల్మన్, ఏపీఓ సావిత్రి, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

శస్త్రచికిత్సలకు ఐదుగురు కుష్టు రోగుల ఎంపిక



రోగులకు స్క్రీనింగ్ చేస్తున్న దృశ్యం

అనంతపురం మెడికల్: వైకల్యంతో బాధపడుతున్న కుష్టు రోగుల్లో శస్త్రచికిత్సలు అవసరమైన వారికి మంగళవారం పలమనేరు ఏమాస్ ఆస్పత్రి నిర్వాహకులు అనంతపురం సర్వజనాస్పత్రిలో స్క్రీనింగ్ నిర్వహించారు. 19 మంది హాజరుకాగా.. అందులో ఐదుగురిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్లు జిల్లా కుష్టు వ్యాధి విభాగం ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనుపమజేమ్స్ తెలిపారు. ఈ నెల 18న కళ్యాణదుర్గం, 19న గుంతకల్లు, 20న గుత్తి, 21న తాడిపత్రి ఆస్పత్రుల్లో స్క్రీనింగ్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కుష్టు వ్యాధితో బాధపడుతున్న వారు స్క్రీనింగ్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ గంగాధర్‌రెడ్డి, డాక్టర్ శివారెడ్డి, పలమనేరు ఏమాస్ ఆస్పత్రి ఫిజియోథెరపిస్టు జాన్‌పీటర్, సిబ్బంది నాగన్న, తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

అనంతపురం: నగరంలోని హౌసింగ్ బోర్డులోని బయలు ప్రదేశంలో పేకాట ఆడుతున్న 11 మందిని అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ శ్రీకాంత్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.2,58,330 నగదు, రెండు కార్లు, 4 బైక్‌లు, 52 పేకముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. టూ టౌన్ పరిధిలో ఎవరైనా పేకాట, మట్కా, బెట్టింగ్, జూదం ఆడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వరద బాధితులకు ఆర్థికసాయం



ఒక్క రోజు వేతనాన్ని అందిస్తున్న ప్రొఫెసర్లు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు వరద బాధితులకు ఆర్థికసాయం చేశారు. ఈ మేరకు వారు తమ ఒక్క రోజు వేతన మొత్తాన్ని ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనితకు మంగళవారం అందజేశారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. రెక్టార్ ప్రొఫెసర్ జి. వెంకటనాయుడు, రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్ బాబు, పీఆర్వో ప్రొఫెసర్ కె.రాంగోపాల్ పాల్గొన్నారు.

హరితవనంగా ఎస్కేయూ



మొక్కకు నీరు పోస్తున్న ఇన్‌చార్జ్ వీసీ అనిత

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయాన్ని హరిత వనంగా మార్చేందుకు కృషి చేద్దామని ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత పిలుపునిచ్చారు. ఎస్కేయూలో 'వన మహోత్సవం'లో భాగంగా మంగళవారం క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాల వద్ద 700 మొక్కలు నాటారు. దశల వారీగా 2 వేల మొక్కలు పెంచేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ జి.వెంకటనాయుడు, రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్‌బాబు, ఎస్టేట్ ఆఫీసర్ ప్రొఫెసర్ బి.రవిప్రసాద్‌రావు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం పూలకుంటలో ఇటుకలపల్లి పోలీసులు మంగళవారం కర్ణాటక మద్యం (టెట్రా ప్యాకెట్లు) పట్టుకున్నారు. గ్రామానికి చెందిన పుట్టపర్తి ఆదినారాయణ కర్ణాటక మద్యం అమ్ముతున్నాడనే పక్కా సమాచారంతో ఇటుకలపల్లి ఎస్ఐ విజయ్‌కుమార్, సిబ్బంది వెళ్లి దాడులు చేశారు. ఆదినారాయణ నుంచి 90 ఎంఎల్ కల్గిన 55 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేశారు.

గొర్రెల కాపరికి పరిహారంఅందజేత

కనగానపల్లి: వేపకుంట గ్రామానికి చెందిన గొర్రెల కాపరి ఈశ్వరయ్యకు అటవీశాఖ అధికారులు రూ.36 వేల పరిహారాన్ని అందజేశారు. అటవీశాఖ అధికారులు తెలిపిన వివరాలు.. గతేడాది జులై 14న వేపకుంట సమీపంలోని పుట్ట కనుమ ఫారెస్టులో గొర్రెల కాపరి ఈశ్వరయ్య తన గొర్రెలను మేపుతున్నాడు. ఆ సమయంలో అటుగా వచ్చిన చిరుత పులి గొర్రెల మందపై దాడి చేసి 9 గొర్రె పిల్లలను చంపేసింది. దీంతో బాధితుని ఫిర్యాదు మేరకు అటవీశాఖ అధికారులు ప్రభుత్వం నుంచి అతనికి పరిహారాన్ని మంజూరు చేయించారు. దీనిని మంగళవారం పెనుగొండ సబ్‌డివిజన్ అటవీశాఖ అధికారులు బాధితునికి అందజేశారు. డివిజనల్ ఫారెస్టు రేంజ్ అధికారులు శ్రీనివాసరెడ్డి, శివరాం, తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూఏలో క్యాంపస్ ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూల్లో పాల్గొన్న విద్యార్థులు

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు రెండో రోజు మంగళవారం కూడా కొనసాగాయి. ఈసీఈ, ఈఈఈ చివరి సంవత్సరం విద్యార్థులకు మోష్‌చిప్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ గత రెండు రోజులుగా క్యాంపస్ ఇంటర్వ్యూలు చేపట్టింది.

ఆర్‌ఓ ప్లాంట్ల ఏర్పాటుకు భూమిపూజ

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో రోగుల సౌకర్యార్థం రూ.20 లక్షల వ్యయంతో రెండు ఆర్‌ఓ ప్లాంట్ల ఏర్పాటుకు సప్తగిరి క్యాంఫర్ సంస్థ ముందుకు వచ్చింది. మంగళవారం ప్లాంట్ల ఏర్పాటుకు భూమి పూజ చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, నర్సింగ్ సూపరింటెండెంట్ నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

విద్య ప్రైవేటీకరణే ప్రభుత్వ లక్ష్యం

అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్రంలో విద్యను ప్రైవేటీకరణ చేయడమే కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు అర్థమవుతోందని వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చంద్రశేఖర్ యాదవ్ మండిపడ్డారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో కొత్త వైద్య కళాశాలలను అడ్డుకొని 700 ఎంబీబీఎస్ సీట్లను పోగొట్టిందని తెలిపారు. గత ప్రభుత్వంలో కొత్త మెడికల్ కళాశాలలు అందుబాటులోకి రావడంతో సీట్లు పెరిగి మన విద్యార్థులు ఎంతోమంది డాక్టర్లు అయ్యే అవకాశాన్ని పొందారని గుర్తు చేశారు. మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ చేయడం వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతారని ఆందోళన వ్యక్తం చేశారు.

బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్‌గా సోమశేఖర్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ సోమశేఖర్ నియమితులయ్యారు. ఎస్కేయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న సోమశేఖర్‌ను బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. వాస్తవానికి పీజీ, ఎంఈడీ పూర్తి చేసిన వారికే ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు అప్పగించాలి. కానీ ఎంఫార్మసీ, పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి ప్రిన్సిపాల్‌గా నియామకం చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

అనంతపురం: ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా వ్యాప్తంగా పోలీసులు వాహనాల తనిఖీ, గ్రామ సభలు, విజిబుల్ పోలీసింగ్ తదితర కార్యక్రమాలు చేపట్టారు. రోడ్డు భద్రతలో భాగంగా నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపే వారికి జరిమానా విధించారు. గొడవలకు దూరంగా ఉండాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాల జోలికి వెళ్లరాదని గ్రామ సభల ద్వారా హెచ్చరించారు. ప్రజలకు భద్రత, భరోసా కల్పిస్తూ విజిబుల్ పోలీసింగ్, నేరాల జరగకుండా కట్టడి చేస్తూ ప్రత్యేక నిఘా పెట్టారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



చెన్నేకొత్తపల్లిలో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు, అధికారులు



రాప్తాడులో పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

చెన్నేకొత్తపల్లి: ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వక్తలు పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా పంచాయతీల్లో మంగళవారం స్వచ్ఛతా హీ సేవ ర్యాలీలను నిర్వహించారు. చెన్నేకొత్తపల్లిలో ఉన్నత పాఠశాల విద్యార్థులు గ్రామ పంచాయతీ సిబ్బంది, సచివాలయాల సిబ్బంది ర్యాలీ చేపట్టారు. స్థానిక బస్టాండ్ వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో ఎంపీడీవో గంగావతి, ఈవోఆర్డీ అశోక్ కుమార్ నాయక్, పంచాయతీ కార్యదర్శులు శ్యామల, శివారెడ్డితో పాటు సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయితీల్లో పంచాయితీ అధికారులు విద్యార్థులతో కలసి ర్యాలి నిర్వహించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పరిసరాలు ఎలా పరిశుభ్రంగా ఉంచుకోవాలి, తడి చెత్త , పొడిచెత్త ఎలా సేకరించాలి అన్న విధానాలను తెలియజేశారు. మండల కేంద్రంలో మండల స్థాయి అధికారులు మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివశంకర్, ఎంఈఓ నరసింహారెడ్డి, ఏపీఎం మదన్‌మోహన్, ఆత్మకూరు సర్పంచ్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు: గ్రామీణ ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని డ్వామా ఏపీడీ సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం జరిగింది. రాప్తాడులో ఏపీడీ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ పాఠశాలల్లో పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో ఏపీడీ అనూరాధ, ఎంపీడీఓ సాల్మన్, ఎంఈఓ మల్లికార్జున, ఈఓఆర్డీ నరసింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.